క్లుప్తంగా

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం


వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: జ్యేష్ఠ అమావాస్యను పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు యనమండ్ర శర్మ ఘనపాఠి, కోట వంశీ, ఫణిశర్మ, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 85 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రత్యక్షంగానూ, మరో 15 మంది భక్తులు ఆన్‌లైన్‌లో రూ.1,116 చెల్లించి పరోక్షంగానూ హోమంలో పాల్గొన్నారు.

జి.కొత్తపల్లిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్


జి.కొత్తపల్లిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీయించి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదర్గ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ–సెబ్) పరిధిలోని కిర్లంపూడి మండలం కొత్త కృష్ణవరంలో సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు సెబ్ సీఐ ఎల్. చిరంజీవి శుక్రవారం తెలిపారు. కొత్త కృష్ణవరం గ్రామానికి చెందిన ఉందుర్తి చిన్నోడు అక్రమంగా సారా తరలిస్తుండగా అదే గ్రామంలో అరెస్టు చేశామన్నారు. నిందితుడి వద్ద నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. స్థానిక సెబ్ సీఐ ఎల్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ ఉపాధి హామీ పనులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: ఉపాధి హామీ పథకంలో అర్హులైన ప్రతిఒక్కరికీ పని కల్పించాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధికారులకు సూచించారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి నిధులు సమకూర్చడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. పుష్కర, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తేవడానికి సుమారు రూ.30 కోట్ల నిధులు అవసరమని తెలిపారు. సమావేశంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ

కాకినాడ రూరల్: వాకలపూడి గ్రామంలో ఉమామనో వికాస కేంద్రంలో ఆయిల్ ఇండియా సహకారంతో దివ్యాంగులకు శుక్రవారం కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ఎస్‌పీ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయిల్ ఇండియా సంస్థ కేజీ బేసిన్ ప్రాజెక్ట్ కాకినాడ నుంచి రూ.4.83 విరాళంతో పాటు 36 మందికి ట్రైసైకిళ్లు, చెవిటి మెషీన్లు, కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయిల్ ఇండియా సంస్థ ఈడీ అంజన్ జ్యోతి పుఖాన్ మాట్లాడుతూ సీఆర్ఎస్ నిధులతో తమ వంతుగా కృత్రిమ అవయవాలు అందించామన్నారు. ఆయిల్ ఇండియా సంస్థ డ్రిల్లింగ్ సీజీఎం సంజీవ్ గొగ్గై, రాఖీ గొగ్గై, ఉమామనో వికాస కేంద్రం నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ధర అదిరే.. సాగు కుదిరే..

- ఖరీఫ్‌లో కూరగాయల సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- పత్తి, వరి కంటే ఎక్కువ ఆదాయం
- అందుబాటులో రైతు బజార్లు

తుని: మెట్టప్రాంత రైతులు మిశ్రమ పంటల వైపు దృష్టి సారించారు. ఒకే పంటను వేయడంతో ఆర్థికంగా నష్టాలను చవిచూస్తున్నారు. మారుతున్న ఆధునిక వ్యవసాయ పద్ధతులకు అనుగుణంగా రైతులు పంటమార్పిడికి ప్రాధాన్యం ఇస్తున్నారు. మెట్ట ప్రాంతంలోని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో రైతులు వరి తర్వాత కూరగాయాల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా ప్రోత్సాహకాలు అందించడం, కూరగాయాలకు డిమాండ్ ఉండడంతో ఎక్కువ మంది సాగుకు సన్నద్ధమయ్యారు.

670 ఎకరాల్లో...

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 670 ఎకరాల్లో రైతులు కూరగాయల సాగు చేస్తున్నారు. రైతులు తమకు ఉన్న తక్కువ భూమిలోనే ఎక్కువ రకాలను సాగు చేస్తున్నారు. దీంతో పాటు కొంత మంది రైతులు అంతర పంటగా కూరగాయల పంటను వేసి మంచి దిగుబడులు సాధిస్తున్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వివిద రకాల కూరగాయలను అన్ని సీజన్లలోను పండించడం ద్వారా ఏడాది పొడుగునా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.

సాగు ఇలా...

మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో వర్షాధార భూములు ఎక్కువ. బోరుబావుల ఉన్న ప్రాంతాల్లో రైతులు కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. గతంలో ఒకే పంటను వేయడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోయేవారు. ఈ విధానానికి స్వస్తి పలికి మిశ్రమ పంటల సాగు వైపు దృష్టి సారించారు. ఎకరా భూమిలో నాలుగు నుంచి ఆరు రకాల పంటలను వేస్తున్నారు. భూమిని చిన్న చిన్న మడులుగా తయారు చేసి వాటిలో వంగ, బెండ, బీర, కాకర, టమాటా, తోటకూర, పాలకూర, గొంగూర, మెంతుకూర, మిరప, కూర బొబ్బర తదితర రకాల పంటలను వేస్తున్నారు. విత్తనాలు ఎంపిక నుంచి ఎరువులు, నీటి యాజమాన్యం వరకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పంట మార్పిడి విధానం పాటించడం వల్ల చీడ, పీడలు తగ్గడంతో పాటు దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంటోంది. ఎకరాకు రూ. 25 వేలు వరకు పెట్టుబడి పెడుతున్నారు. ఏడాదికి రూ.80 వేల వరకు ఆదాయం తీస్తున్నారు.


తుని మండలం చామవరంలో బెండ సాగు

నియోజకవర్గం	కూరగాయల సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
తుని	340
ప్రత్తిపాడు	220
జగ్గంపేట	110

రైతులే నేరుగా విక్రయాలు

తుని మండలంలోని చామవరం, వల్లూరు, కుమ్మరిలోవ, వి.కోత్తూరు, తాళ్లూరు, కొలిమేరు, రేఖవానిపాలెం, మరువాడ, నందివొంపు, దొండవాక, కేఓ మల్లవరం, లోవకొత్తూరు, వల్లూరు తదితర గ్రామాల్లో పండించిన కూరగాయలను రైతులు తుని మార్కెట్ యార్డుకు తీసుకువస్తున్నారు. రైతు బజారులో నేరుగా రైతులే అమ్ముకుంటున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొనుగోళ్లు చేసి ఎగుమతులు చేస్తున్నారు. జగ్గంపేట రైతులు కాకినాడకు, ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోని రౌతులపూడి, శంఖవరం మండలాలకు చెందిన రైతులు విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయవాడ తదితర ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నారు. శ్రావణం, కార్తిక మాసాల్లో కూరగాయలకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో రైతులు కూరగాయల సాగుకు మొగ్గుచూపుతున్నారు.

రైతులకు రాయితీపై విత్తనాలు



కాయగూరల పంటలు సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా రాయితీపై విత్తనాలు అందిస్తున్నాం. బోరు బావి సదుపాయం ఉన్న రైతులకు డ్రిప్‌ను ఏర్పాటు చేసుకోవడానికి 90 శాతం మేర రాయితీని ప్రభుత్వం అందిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో కూరగాయల సాగు లాభదాయకం. మార్కెట్‌లో రాబోయే రెండు నెలల్లో మంచి డిమాండ్ ఉంటుంది. ప్రభుత్వం ఉచిత విద్యుత్ సదుపాయంతో పాటు రైతులకు వడ్డీలేని రుణాలను అందిస్తుంది.

–ఎం. విజయలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి ,తుని

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి కాటం భాను

ప్రత్తిపాడు: వాహన చోదకులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను సూచించారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో శుక్రవారం జరిగిన న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. వాహన ప్రయాణంలో అజాగ్రత్త పనికిరాదన్నారు. అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్లనే ప్రమాదాలు జరుగుతాయన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఉత్పన్నమయ్యే అనర్థాలను ఆయన వివరించారు. ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే కొత్త నేర న్యాయ చట్టాల ప్రకారం తీవ్రమైన శిక్షలు ఉంటాయని న్యాయమూర్తి కాటం భాను హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎస్సై ఎం. పవన్‌కుమార్, బార్ అసోసియేషన్ కార్యదర్శి బొంగుభూరి మధుబాబు, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ సభ్యురాలు అవసరాల దేవి, బార్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు

రౌతులపూడి: ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశు వైద్యశాల వద్ద శనివారం కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్టు మండల పశువైద్యాధికారి ఎం.వీర్రాఘవరావు శుక్రవారం తెలిపారు. మూడు నెలల వయస్సు దాటిన కుక్కలకు ఈ టీకాలు వేస్తారన్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నిర్వహించే ఈ వ్యాక్సినేషన్‌ను కుక్కలు పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యాంటీ రేబిస్ టీకాలు సిద్ధం

ప్రత్తిపాడు: ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడు ప్రాంతీయ పశు వైద్య శాలలో శనివారం కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్టు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ తెలిపారు. స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రత్తిపాడులో ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు వేసేందుకు ప్రభుత్వం 690 టీకాలను మంజూరు చేసిందన్నారు. వీటిని ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాలకు కేటాయిస్తున్నట్టు చెప్పారు. సుమారు 180 రకాలకు పైబడిన వ్యాధులు పశుపక్ష్యాదుల నుంచి మనుషులకు సంక్రమిస్తాయన్నారు. ఈ జూనోటిక్ వ్యాధుల గురించి ప్రజలను అప్రమత్తం చేసి, జూనోటిక్ రోగాల బారిన పడకుండా చేయడమే ప్రపంచ జూనోసిస్ దినోత్సవం ప్రధాన ఉద్దేశమన్నారు. పశుపక్ష్యాదులతో మెలిగే పశు వైద్యులు, రైతులు, పెంపుడు జంతువులతో సన్నిహితంగా ఉండే వారికి ఎక్కువుగా ఈ వ్యాధులు సంక్రమిస్తాయని చెప్పారు. పశువుల పెంపకందారులు, రైతులు, ప్రజలు జూనోటిక్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

టెన్త్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీఈఓ రమేష్
- కోటనందూరు హైస్కూల్‌లో తనిఖీలు

కోటనందూరు: పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ ఆదేశించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా 10వ తరగతి విద్యార్థుల గదికి వెళ్లి అందుతున్న విద్యపై ఆరా తీశారు. పలు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టడం ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేశారు. క్లాస్, హోం వర్క్ పుస్తకాలను పరిశీలించారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడానికి ఎలాంటి ప్రణాళికతో చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణ, పక్కా ప్రణాళికతో చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సబ్జెక్టుల వారీగా సమీక్షించారు. విద్యాబోధనలో అనుసరిస్తున్న విధానాలపై ఆరా తీశారు. 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తరచూ పాఠశాలను సందర్శిస్తానని, మెరుగైన ఫలితాలు సాధించే దిశగా అడుగులేయాలని ఆదేశించారు. అనంతరం పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఏపీఎస్ శ్రీనివాస్, ఎంపీ రామశేఖర్, హెచ్ఎం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


కోటనందూరు హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రమేష్

రైతులు ఎంటీయూ 1262 రకం సాగు చేయండి

మండల వ్యవసాయ అధికారి అశోక్ కుమార్



తుని రూరల్: మెట్ట ప్రాంతంలో వరిసాగు చేసే రైతులకు వరప్రదాయిని ఎంటీయూ 1262 రకం విత్తనాలని తుని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్ కుమార్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మెట్ట ప్రాంత రైతులు తమ ఇంట్లో రోజువారి వాడకానికి ఉంటాయని సన్నరకాల వరి వంగడాలను సాగు చేస్తారన్నారు. అందుకు అనువుగా ఆర్‌జీఎల్ 2537, బీపీటీ 5204 రకాల విత్తనాలను సాంప్రదాయంగా పండిస్తున్నారన్నారు. ఈ రకాలు సాగులోకి వచ్చి 30 ఏళ్లవడంతో పురుగులు, తెగుళ్లకు గురై దిగుబడులు తగ్గిపోతున్నాయన్నారు. పెట్టుబడి ఖర్చులు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. ఆర్‌జీఎల్ రకం వరినారు నాటుకోవడానికి ఈ ప్రాంతం అనుకూలంగా ఉందన్నారు. ఇది దీర్ఘకాలిక రకం కావడంతో అక్టోబర్, నవంబర్ నెలల్లో వచ్చే తుపాన్లు, వరదల కారణంగా పంటకు నష్టం వాటిల్లుతోందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా మార్టేరు వరి పరిశోధనా సంస్థ ఎంటీయూ 1262 రకం వంగడాలను రూపొందించిందన్నారు. ఈ రకం విత్తనాలను గతేడాది తేటగుంట, డి.పోలవరంలో ప్రయోగాత్మకంగా పండించినట్టు ఆయన తెలిపారు. ఈ రకం వరిపైరు ఎక్కువగా తుపాన్లు, ఈదురు గాలులు, చీడపీడలను, తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడిని ఇచ్చిందన్నారు. 155 రోజుల నుంచి 160 రోజుల వరకు పంటకాలం ఉంటుందన్నారు. ఖరీఫ్‌లో దిగుబడి ఎకరాకు 35 నుంచి 40 బస్తాలు వస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. గింజ అతిసన్నగా ఉండడం వల్ల సాంబ మసూరికి ప్రత్యామ్నాయంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. వినియోగానికి అనువుగా ఉండి మంచి దిగుబడి వచ్చే ఎంటీయూ 1262 రకాన్ని రైతులు సాగు చేయాలని ఏఓ సూచించారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి


శృంగవరంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం


గోకవరంలో డయేరియా నివారణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్య, ఐసీడీఎస్ అధికారులు

రౌతులపూడి: ప్రస్తుతం వాతావరణ మార్పుల నేపథ్యంలో వ్యాప్తి చెందుతున్న అతిసార వ్యాధిపై పలు అప్రమత్తంగా ఉండాలని శంఖవరం ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి సూచించారు. మండలంలోని ఎస్.పైడిపాల, శృంగవరం గ్రామాల్లో ప్రజలకు శుక్రవారం కళాజాతాల ద్వారా అతిసార వ్యాధి నిర్మూలన–బాల్య వివాహాల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు బాల్య వివాహాలు చేస్తే భవిష్యత్‌లో ఎన్నో ఇబ్బందులు వస్తాయన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్రస్తుతం గ్రామాల్లో అతిసార వ్యాధి ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఆహారపు అలవాట్లలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఐసీడీఎస్ మండల విస్తరణాధికారి జానకీలక్ష్మి, సచివాలయ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనకు కృషి చేయాలి

గోకవరం: డయేరియా నిర్మూలనకు అంగన్‌వాడీ సిబ్బంది కృషి చేయాలని కొత్తపల్లి వైద్యాధికారి డాక్టర్ తిరన్ సూచించారు. స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కాచిచల్లార్చిన నీటిని ఇవ్వాలని, ఆహారం వేడిగా ఉన్నప్పుడే వారికి అందించాలని సూచించారు. అనంతరం డయేరియా నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సీడీపీఓ వరలక్ష్మి, ఎంపీడీఓ గోవిందు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఇందిరా, ఎంపీహెచ్ఈఓ శంకర్, హెచ్‌వీ రాజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్

జగ్గంపేట: చిరుధాన్యాల సాగు ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.విజయకుమార్ అన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం జగ్గంపేట, గండేపల్లి మండల వ్యవసాయ సిబ్బందికి చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల పరిధిలో నిర్దేశించిన లక్ష్యం మేరకు చిరుధాన్యాల సాగు జరిగేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. రైతులు పండించిన చిరుధాన్యాలకు మద్దతు ధర ఇవ్వడంతో పాటు, వాటి కొనుగోలును మార్క్‌ఫెడ్ చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం కరప ఏడీఏ, పొలంబడి రిసోర్స్‌పర్సన్ బాబూరావు పొలంబడి ప్రయోజనాలు, సమీకృత వ్యవసాయ విధానాలను వివరించారు. కార్యక్రమంలో జగ్గంపేట ఏడీఏ గంగాధర్, జగ్గంపేట వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్, గండేపల్లి ఏఓ సద్గురుమూర్తి, హబ్ ఏఓ కరుణాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ మెహర్ శుక్రవారం తెలిపారు. ఇంటర్మీడియెట్, తత్సమానం పరీక్షల్లో ఉతీర్ణత సాధించిన విద్యార్థులకు బీఏ, బీకాం (కంప్యూటర్స్), బీఎస్సీ (జువాలజీ), బీఎస్సీ (కెమిస్ట్రీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా మరిడమ్మ జాతర


మరిడమ్మతల్లిని దర్శించిన వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు, తదితరులు

అన్నవరం: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో వేంచేసిన గ్రామదేవత మరిడమ్మతల్లి జాతర మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకూ పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు తదితరులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. యనమల కృష్ణుడుకు ఆలయం వద్ద ఎంపీటీసీ దడాల సతీష్, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపు

జాతర సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ అమ్మవారిని అన్నవరం పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. గరగల నృత్యం, విచిత్ర వేషధారణలు, జానపద నృత్యాలు, తీన్‌మార్ డప్పులు నడుమ ఊరేగింపు సాగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

అర్హులందరికీ కౌలు కార్డులు


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రంగారావు


జగ్గంపేట రెవెన్యూ సిబ్బందితో సమీక్షిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

ఏలేశ్వరం: అర్హులైన రైతులందరికీ కౌలు కార్డులు సకాలంలో అందజేయాలని తహసీల్దార్ వై.రంగారావు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు కౌలు కార్డులపై వీఆర్వోలు అవగాహన కల్పించాలన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ కౌలు రైతు కార్డులు మంజూరు చేయాలన్నారు. సుమోటోగా అర్హులకు త్వరితగతిన కులధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు. పెండింగ్‌లో లేకుండా కుల ధ్రువీకరణ పత్రాలను వెంటనే మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ బి.జ్యోతి, డీటీ గంధం రవి, వీఆర్వోలు అవసరాల కిషోర్, రొంగల శ్రీను, కె.సత్యారావు, చిన్నారి, శ్యామల, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో సీసీఆర్‌సీ కార్డులు అందించాలి

జగ్గంపేట: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో కౌలు రైతులకు అందించే పంటసాగుదారు హక్కు పత్రం (సీసీఆర్‌సీ)ను సకాలంలో అందించాలని పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు అధికారులకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా వచ్చే అన్ని పథకాలు పొందేందుకు వీలుగా రైతులకు అవసరమైన సర్టిఫికెట్లు మంజూరు చేయాలని సూచించారు. ప్రధానంగా కులధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు రైతులకు అవసరమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇంతియాజ్ పాషా, డిప్యూటీ తహసీల్దార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ప్రశ్నించేతత్వం పెరగాలి

సామర్లకోట: విద్యార్థులలో ప్రశ్నించే తత్వం పెరిగేలా చూడాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఉండూరు శివారు ప్రకాశరావుపేట ఎలిమెంటరీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. అలాగే విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరీక్షించి పలు సూచనలు ఇచ్చారు. పాఠశాలకు వచ్చిన ప్రతీ విద్యార్థి మధ్యాహ్న భోజనం చేయాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా తల్లిదండ్రులతో మంచి సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు.

చదవడం, రాయడంపై దృష్టి పెట్టాలి

సామర్లకోట: విద్యార్థులు పాఠ్యాంశాలను చదవడం, రాయడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఎంఈఓ–2 పి.పుల్లయ్య అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని కాపవరంలోని ఎలిమెంటరీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల పుస్తకాలు, హాజరు శాతం, పరిసరాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

డంపింగ్ యార్డుగా మారిన మార్కెట్


ఏలేశ్వరం మార్కెట్ యార్డులో పేరుకుపోయిన చెత్త

ఏలేశ్వరం: ఈ ఫోటోలో చూస్తున్నది డంపింగ్ యార్డు అనుకుంటే మీరు పొరబడినట్టే. ఇది ఏలేశ్వరం నగర పంచాయతీలోని మార్కెట్ యార్డు. పట్టణం నడిబొడ్డున ఉన్న ఈ మార్కెట్ యార్డులో నిత్యం కూరగాయల అమ్మకాలు జరుగుతాయి. కాగా వారపు సంతరోజున కూరగాయల దుకాణాల సమీపంలో పారిశుధ్య సిబ్బంది వేసిన చెత్త ఇది. గతకొన్ని రోజులుగా మార్కెట్‌యార్డు, సమీప ప్రాంతాల్లోని వ్యర్థాలను ఇక్కడ వేస్తున్నారు. గతంలో చెత్తను సుదూర ప్రాంతంలో వేసేవారు. ప్రస్తుతం దుకాణాల సమీపంలో వేస్తున్నారు. దీంతో తాము రోగాల బారిన పడతామని దుకాణాదారులు వాపోతున్నారు. కూరగాయాలు కొనుగోలు చేసే ప్రజలకు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి చెత్తను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.